క్లుప్తంగా

స్వామివారికి వెండి మకరతోరణం వితరణ


మకరతోరణం బహూకరిస్తున్న దాతలు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీ శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలోని శ్రీ లక్ష్మీ గణపతి స్వామికి అక్షయ తృతీయ సందర్భంగా సత్యం ఇంటర్నేషనల్ స్కూల్ యజమాని సత్యనారాయణ, రమాదేవి దంపతులు శుక్రవారం వెండి మకరతోరణం బహూకరించారు. ఈ సందర్భంగా తోరణాన్ని ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణలకు దాతలు అందజేశారు.

కాంగ్రెస్ రోడ్ షో


కార్నర్ మీటింగ్‌లో అభ్యర్థి రంజిత్‌రెడ్డి తదితరులు

బడంగ్‌పేట్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మేయర్ చిగురింత పారిజాత ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్‌లో భారీర్యాలీ, కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల బరిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, పీసీసీ కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోల్కంపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం

ఇబ్రహీంపట్నం రూరల్: భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బడుగు, బలహీన వర్గాల నేత క్యామా మల్లేశ్‌ను అత్యధిక మోజార్టీతో గెలిపించాలని పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం పోల్కంపల్లి గ్రామంలో క్యామా మల్లేష్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సావిత్రి, నర్సింహా, చెరుకూరి రవీందర్, దానయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మేడిబాయి రవి, మొద్దు బాల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, కృష్ణ, రాజు, కుమార్, దౌలత్‌లు పాల్గొన్నారు.

'ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపిద్దాం'

కడ్తాల్: పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపించుకుందామని మండల అధ్యక్షుడు మాన్యనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాన్యనాయక్ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, గిరిజన మోర్చ అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి మహేశ్, మోహన్‌రెడ్డి, డాక్టర్ రమేశ్, రవీందర్‌రెడ్డి, భగీరథ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాడ్గుల: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ సునీల్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, నీటి సౌకర్యాలను ఏర్పాటు చేయించారు. మాడ్గుల మండల వ్యాప్తంగా 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు.

24వ వార్డులో జోరుగా ప్రచారం

తుర్కయంజాల్: పోలింగ్‌కు కేవలం కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉండటంతో పురపాలక సంఘం పరిధిలోని 24వ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించడంతో పాటు, సభలు, సమావేశాలు, రోడ్‌షోలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ప్రచారం చివరి అంకానికి చేరుకోవడంతో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు.

పూటకో జెండాతో ప్రచారం

అయోమయంలో ప్రజలు
- ఓటర్ల ప్రసన్నం కోసం నేతల పాట్లు
- పెద్దల మెప్పుకోసం ద్వితీయ శ్రేణి నాయకుల ఆరాటం
- మీర్‌పేట కార్పొరేషన్‌లో 'కొత్త' ప్రచారం


మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేట: అప్పటికప్పుడే కండువాలు మారుతున్నాయి. ప్రచారం శైలీ మారుతోంది. మొన్నటి వరకు ఒక పార్టీ జెండా పట్టుకుని, ఈ గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేసిన కార్యకర్తలు, నాయకులు.. మరుసటి రోజు మరో జెండా చేతపట్టి, ఈ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్టీలు మారిన నేతలతో ఓ పక్క ప్రజలు అయోమయానికి గురవుతుండగా.. మరో పక్క ఎలాగైనా ఓట్లు సంపాదించి, బలం నిరూపించుకోవాలన్న పట్టుదలతో నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదీ మీర్‌పేట కార్పొరేషన్‌లో పార్టీలు మారిన ప్రజాప్రతినిధులు, నాయకుల పరిస్థితి.

నేతల ఆరాటం..

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇటీవల కార్పొరేషన్‌లో మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పార్టీలు మారారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పార్టీ తరఫున ప్రచారానికి వెళ్లినప్పుడే అసలు సమస్య ఎదురవుతోంది. మొన్నటి వరకు ఒక పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించిన శ్రేణులు.. తాజాగా మరో పార్టీ జెండాతో దర్శనమిచ్చి ఈ పార్టీ గుర్తుకు వేయాలని అడగడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. పలుచోట్ల ఇదేంటని నిలదీసినట్లు సమాచారం. దీంతో పెద్ద తలకాయలు తలలు పట్టుకుంటున్నారు. ఎలాగైనా ఓట్లు దండుకొని, పెద్దల మెప్పు పొందాలన్న లక్ష్యంతో ఓటరు దేవుళ్లను పలానా గుర్తుకు ఓటు వేయాలని ద్వితీయ శ్రేణి నాయకులు వేడుకోవటం గమనార్హం.

పార్టీ మారినంత సులువుకాదు..

ప్రస్తుత ఎన్నికల్లో కార్పొరేషన్ పరిధిలో అధిక లీడ్ ఇవ్వాలన్న పట్టుదలతో ప్రధాన పార్టీల సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే ఇతర పార్టీల్లోని అసమ్మతి నేతలు, ప్రజాప్రతినిధులను తమ పార్టీల్లో చేర్చుకున్నారు. చేరిన వారి వలన తమకు కలిసొస్తుందా? లేదా.. మొదటికే మోసం వస్తుందా? అనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలు మారినంత సులువుగా ప్రజల నాడీ తెలుసుకోవడం ప్రస్తుత ఎన్నికల్లో కష్టంగా మారిందని, స్థానిక నేతలు చెప్పిన పార్టీకే ప్రజలు ఓట్లు వేస్తారని నమ్మకం పెట్టుకోవడం కూడా అధినేతల పొరపాటేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

పేదల సొమ్ము.. పెద్దల పాలు!

- అదానీ, అంబానీలకు దోచి పెడుతున్న మోదీ
- బీజేపీని ఓడిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం
- ప్రజా సంఘాల నేతలు

కందుకూరు: భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిన ప్రధాని మోదీని ఓడించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అని భారత్ జోడో అభియాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ విస్సా కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని, సుస్థిర అభివృద్ధిని గాలికి వదిలేసి, అధికారం కోసం విద్వేషాలు రెచ్చగొడుతూ, సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను మోదీ చేస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా రిజర్వేషన్లను ఎత్తివేస్తామని ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. పేదలను విస్మరిస్తూ అదానీ, అంబానీ లాంటి వారికి దోచిపెడుతున్నారని విమర్శించారు. దేవుళ్ల పేరుతో ఓట్లు అడిగే బీజేపీకి ఓటు వేయొద్దని కోరారు. ఇందులో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహా, దళిత బహుజన గ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గండు నర్సింహ, ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తిరుపతి, నాయకులు కె.స్వప్న, కె.జంగయ్య, ఆర్.చందు, డేవిడ్, బి.రాబర్ట్, ఆలేటి కృష్ణ, జి.మహేశ్‌చారి, బి.నర్సింహా, జి.రవి, ఎస్.శ్రావణ్, పెద్దరామయ్య, జైపాల్, కె.నర్సింహా, చెన్నయ్య, జగన్, నర్సింహాచారి, శేఖర్, పాండు, అంజయ్య, రాములు, భిక్షపతి, మహేష్, కె.రాములు, యోగేష్, సురేష్, మహేశ్, హీరాలాల్ ఉన్నారు.


సమావేశంలో నినదిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


కందుకూరు: సార్లరావులపల్లిలో ప్రచారం చేస్తున్న గులాబీ శ్రేణులు

అబద్ధాలతో అందలమెక్కిన హస్తం

- హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

కందుకూరు: అమలు సాధ్యం కాని హామీలతో, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అందలం ఎక్కిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం గులాబీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, అన్ని రంగాల్లో తెలంగాణ దూసుకుపోయిందని వెల్లడించారు. తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలంటే కారు గుర్తుకు ఓటువేసి, పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించి, పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఇందులో పార్టీ నాయకులు ప్రవీణ్‌నాయక్, గోవర్ధన్‌నాయక్, వెంకటేశ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

మండల పరిధి అన్నోజిగూడకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ కాకి ఇందిర ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎ.అంజయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొన్నారు. ఇందులో పార్టీ నాయకులు జంగయ్య, రామకృష్ణ, లక్ష్మణ్, రమేష్, కృష్ణ, మహేందర్, సురేష్‌నాయక్, గణేశ్, రాజు, పరమేష్, మధుసూదన్, దేవేందర్, శ్రీశైలం, పి.దర్శన్, ప్రశాంత్, నారాయణ, డి.రాజు. డి.కృష్ణ, పుచ్చల జంగయ్య, సత్తయ్య, దాసు ఉన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కౌన్సిలర్ రవి నాయక్ మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ గెలిస్తేనే అభివృద్ధి పనులకు అత్యధిక నిధులు మంజూరవుతాయని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరుతూ శుక్రవారం చౌదర్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఓటు వేయమని అభ్యర్థించారు. రానున్న కాలంలో ఉపాధి పనులు కొనసాగాలంటే కమలం పువ్వు గుర్తుపై ఓటేసి మూడోసారి నరేంద్రమోడీని ప్రధానిని చేయాలని కూలీలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో జరిగే సీసీ రోడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు తదితర అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు వస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్‌గౌడ్, నుడుకుడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుభిక్ష పాలన

- అన్ని వర్గాలకు సమన్యాయం
- చేతి గుర్తుకు ఓటువేసి, రంజిత్‌రెడ్డిని గెలిపించాలి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు


కందుకూరు: సరస్వతిగూడలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కందుకూరు: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండల పరిధి సరస్వతిగూడలో ఆ పార్టీ శ్రేణులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదయ్య, సత్యనారాయణరెడ్డి తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ నాయకులు బి.మల్లేశ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, మూల హన్మంత్‌రెడ్డి, జి.బలవంత్‌రెడ్డి, కె.కరుణాకర్‌రెడ్డి, ఎ.పాండుగౌడ్, కె.రాజిరెడ్డి, కె.పాండురంగారెడ్డి, ఎ.మహేందర్, జి.నరేష్, పి.విజేందర్, ఎం.రాకేష్, ఎండీ రహీం, శంకర్, ఎండీ ఖలీల్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

అన్నోజిగూడకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకుడు ఢిల్లీ కృష్ణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సమక్షంలో వారు హస్తం కండువా కప్పుకొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఢిల్లీ రాజు, నీలం రవి, ఢిల్లీ మల్లేశ్, అంబటి శ్రీనివాస్, డి.కృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడారు. పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో నాయకులు సత్యనారాయణ, మదన్‌పాల్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, ఎ.నర్సింహా ఉన్నారు.

పలువురు చేరిక

కందుకూరు: మండల పరిధి నేదునూరు, లేమూరు గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, కల్యాణ్‌కార్ రూప్‌చందర్, రావిచెట్టి మల్లేశ్, ముచ్చర్ల లక్ష్మయ్య తదితరులు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకొన్నారు. ఇందులో వైస్ ఎంపీపీ జి.శమంత, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు జంగారెడ్డి, మల్లేశ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పార్టీ కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ ఉన్నారు.

రాహుల్‌ను ప్రధానిని చేయాలి

పహాడీషరీఫ్: కాంగ్రెస్‌తోనే ప్రజా పాలన అని, కేంద్రంలోనూ అధికారంలోకి వస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి నిజాముద్దీన్, మున్సిపాలిటీ కో–ఆర్డినేటర్ షేక్ జహంగీర్, కౌన్సిలర్లు యాదగిరి, లక్ష్మీనారాయణ, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు రవికుమార్, తయ్యబ్ దయానీ, బాబు, నవీన్ గౌడ్, నవాజ్, బాలాజీ ఉన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం దక్కుతుందని ఆ పార్టీ మామిడిపల్లి సీనియర్ నాయకుడు లాల్ సతీష్ గౌడ్, ఆదిల్ల జంగయ్యలు అన్నారు. రంజిత్ రెడ్డికి మద్దతుగా ఇంటింటికి ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌ను గెలిపించాలని కోరారు. ఇందులో భాస్కర్ ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

మహేశ్వరం: బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దు చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ఆరోపించారు. మండల పరిధి గొల్లూరు, కొళ్లపడకల్, కల్వకోల్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల శ్రేణులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడారు. రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇందులో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి నిజాముద్దీన్, పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రఘుపతి, ఈశ్వర్, యాదయ్య, మాజీ సర్పంచ్ హరినాథ్ గౌడ్ తదితరులు ఉన్నారు.


పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

సీఎంను కలిసిన నాయకులు

మహేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డిని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుండెమోని అంజయ్య ముదిరాజ్ గురువారం రాత్రి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డితో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎంపీగా రంజిత్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నేతలకు సూచించారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి

- మోదీ పాలనను కోరుకుంటున్న దేశ ప్రజలు
- కమలం గుర్తుకు ఓటువేసి, కొండాను గెలిపించండి
- ఇంటింటి ప్రచారంలో బీజేపీ శ్రేణులు

తుక్కుగూడ: బీఆర్ఎస్ పాలన కాలంలో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధిలో దూసుకుపోతుందని కొండా సతీమణి సంగీతారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి తుక్కుగూడ తండాలో ఇంటింటి ప్రచారం చేశారు. గిరిజనుల సంప్రదాయ దుస్తులు ధరించి ఓటర్లను ఆకట్టుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని తెలిపారు. దేశ ప్రజలు మరోసారి మోదీ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, కమలం గుర్తుకు ఓటు వేసి, కొండాను ఆశీర్వదించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

కొండా విజయం తథ్యం..

కందుకూరు: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం తథ్యమని, మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎంపీపీ మంద జ్యోతి ఆశాభావం వ్యక్తంచేశారు. మండల పరిధి సార్లరావులపల్లి, బాచుపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీల వద్దకు కమలం గుర్తుకు ఓటు వేసి, కొండాను గెలిపించాలని అభ్యర్థించారు.


మీర్‌పేట: పార్టీలో చేరిన వారితో శ్రీరాములు యాదవ్

బీజేపీలో పలువురు చేరిక

మీర్‌పేట: ప్రస్తుత ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ధీమా వ్యక్తంచేశారు. మీర్‌పేట కార్పొరేషన్ 35వ డివిజన్‌కు చెందిన యువకులు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్, యువ మోర్చా నాయకులు మనీష్‌ల ఆధ్వర్యంలో శ్రీరాములు సమక్షంలో పలువురు కాషాయ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడారు. కొండా విజయం కోసం శ్రేణులు కష్టపడి పనిచేయాలని, పార్టీని నమ్ముకున్న వారికి భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాజేష్, రాజు, నర్సింగ్, సంతోష్, విష్ణు, అంజి, శివప్రసాద్ ఉన్నారు.


తుక్కుగూడ తండాలో ప్రచారం చేస్తున్న కొండ సంగీతారెడ్డి

మహేశ్వరం: బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కొండా సతీమణి సంగీతారెడ్డి కోరారు. మండల పరిధి నాగారం గ్రామ పంచాయతీ అనుబంధ గిరిజన తండాల్లో ఆమె కొండాకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. అవినీతి రహితుడైన విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

'ఉపాధి'లో అక్రమాలు, అవకతవకలు!

యాచారం: ఉపాధి పనుల్లో అక్రమాలు, అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. యాచారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం జరిగింది. 24 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు దాదాపు రూ. నాలుగున్నర కోట్లకు పైగా పనులు జరిగాయి. దీనికి సోషల్ ఆడిట్ అధికారులు ప్రతీ గ్రామంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో వెలుగులోకి వచ్చిన నిధుల దుర్వినియోగం, కూలీల ఇబ్బందులు, రైతులకు సమాచారం లోపం తదితర సమస్యలపై శుక్రవారం మండల సామాజిక తనిఖీ ప్రజావేదికలో సోషల్ అడిట్ బృందం వివరాలు వెల్లడించారు. అడిషనల్ డీఆర్డీఓ సుభాషిణి, క్వాలిటీ కంట్రోల్ అధికారి పద్మావతి, అంబుడ్స్‌మెన్ సునీతా, విజిలెన్స్ అధికారి కొండయ్యతో పాటు యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కూలీలకు పే స్లిప్పులు సకాలంలో ఇవ్వకపోవడం, ఎంబీ రికార్డుల్లో నమోదు చేయకుండానే నిధులు మంజూరు చేయడం, రైతులకు సమాచారం ఇయ్యకుండానే వారి వ్యవసాయ భూముల్లో భూ అభివృద్ధి, వరద కట్టల నిర్మాణ పనులు చేపట్టడం, సంరక్షణ లోపం వల్ల ఆయా గ్రామాల్లో వందలాది మొక్కలు ఎండిపోవడం వంటి వివరాలను వెల్లడించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రూ. లక్షలాది నిధులు దుర్వినియోగమైనట్లు వారు పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌ని గెలిపించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు. కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ నాగమణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకోబా, బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ తుమ్మలూరి శ్రీను, మాజీ వార్డు సభ్యులు బాల్‌రాజ్, వడ్డెకృష్ణ, బీరయ్య, శివాజీ, మహేశ్, వెంకటయ్య, రాములు, కృష్ణయ్య, మల్లయ్య, వంశీ నిరంజన్ తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పారదర్శకమైన ప్రజా పాలన సాగుతుందని తెలిపారు. పది సంవత్సరాలుగా దేశాన్ని పాలించిన బీజేపీ, రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీలు ప్రజాపాలనను విస్మరించి దుర్మార్గమైన పాలన సాగించాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పురుషోత్తంరెడ్డి, రామునాయక్, చేనేత సంఘం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణయ్య, అనంతరెడ్డి, కొండల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.